ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట 5

శుక్రవారం 3 మే 2024

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యేనా?

- కొత్త జిల్లాల ఏర్పాటుతో ముక్కలు చెక్కలు
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నేరవేర్చాలని వేడుకోలు

7లో..



సదాశివపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జయమ్మ, కౌన్సిలర్ విశ్వనాథ్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న జగ్గారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన సదాశివపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జయమ్మ, కౌన్సిలర్లు, నాయకులతో జగ్గారెడ్డి

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన 'పేట' మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

- మరో ఇద్దరు కౌన్సిలర్లు కూడా..

సంగారెడ్డి, మే 2, (ఆంధ్రజ్యోతి): సదాశివపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జయమ్మ గురువారం మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమె కుమారుడు, కౌన్సిలర్ విశ్వనాథ్‌ను కూడా జగ్గారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఇదే మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్ వాజిద్‌కు కూడా జగ్గారెడ్డి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన వీరు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరారని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ చైర్‌పర్సన్ జయమ్మ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలన అద్భుతంగా ఉందని కితాబిచ్చారు.



హత్నూర మండలం దౌల్తాబాద్‌లో రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కాంగ్రెస్ బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయి

- హామీల అమలులో విఫలం నమ్మి ఓటేస్తే ఆగం చేశారు
- బీజేపీ అభ్యర్థి బ్లాక్‌మెయిలర్, కాంగ్రెస్ అభ్యర్థి ఆరోతరగతి
- ఉన్నత విద్యావంతుడైన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిదే గెలుపు : మాజీ మంత్రి హరీశ్‌రావు

7లో..

పోలింగ్ ప్రారంభం

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మిరుదొడ్డి మండలం అందెలో వయోవృద్ధుల ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

మిరుదొడ్డి/దుబ్బాక, మే 2: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. హోం ఓటింగ్‌లో భాగంగా గురువారం 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిరుదొడ్డి మండలం అందె గ్రామంలోని 85 సంవత్సరాలు దాటిన వయోవృద్దురాలు బాలమ్మ తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నది. అలాగే దుబ్బాక మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా వయోవృద్ధుల ఓటింగ్ కార్యక్రమా న్ని ప్రారంభించారు. అందెలో పోలింగ్ సరళిని పరిశీలించిన అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ.. ఓటును వజ్రాయుధంలా ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



తొగుట మండలం తుక్కాపూర్ గ్రామశివారులోని మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోని నీటి నిల్వలు

మల్లన్నసాగర్‌లో అడుగంటుతున్న జలాలు

- ప్రస్తుతం నీటి నిల్వ 9.25 టీఎంసీలు
- రిజర్వాయర్ డెడ్‌స్టోరేజ్ 5 టీఎంసీలు మాత్రమే
- ఉన్న నీటిని తాగునీటి కోసం పంపింగ్
- ఖరీఫ్ సాగుకు నీటి విడుదల కష్టమే!?

తొగుట, మే 2 : తొగుట మండలం తుక్కాపూర్ గ్రామశివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో నీటినిల్వలు రోజురోజుకూ అడుగంటుతున్నాయి. ప్రస్తుతం 9.25 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. మల్లన్న సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ 5 టీఎంసీలు కాగా అంతకు మించి ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథకు, హైదరాబాద్ వాటర్ బోర్డుకు పంపింగ్ చేస్తున్నారు. దీంతో ఖరీఫ్ సాగుకు నీరు విడుదల చేస్తారోలేదోన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది. మల్లన్నసాగర్ రిజర్వాయర్ ప్రారంభించినప్పటి నుంచి గతేడాది వరకు గత ప్రభుత్వ హయాంలో కొండపోచమ్మ రిజర్వాయర్, అప్పర్‌మానేర్, సిద్దిపేట, దుబ్బాక, సిరిసిల్ల నియోజకవర్గాల్లోని గొలుసుకట్టు చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలకు 27.24 టీఎంసీల నీటిని అధికారులు విడుదల చేశారు. గత సెప్టెంబరు 6 వరకు రిజర్వాయర్‌లో 10.67 టీఎంసీల నీరు నిల్వ ఉండగా సెప్టెంబరు 7 నుంచి అధికారులు ఆరు బాహుబలి మోటార్ల ద్వారా 16 రోజుల పాటు రంగనాయకసాగర్ రిజర్వాయర్ నుంచి 4.50 టీఎంసీల నీటిని అధికారులు మల్లన్నసాగర్‌లోకి ఎత్తిపోశారు. మల్లన్నసాగర్‌లో నీటినిల్వలు 15.17 టీఎంసీలకు చేరాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనవరి 23న మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ సిద్దిపేట, దుబ్బాక, సిరిసిల్ల నియోజకవర్గాల్లో గొలుసుకట్టు చెరువులకు 4.50 టీఎంసీల నీటిని విడుదల చేశారు. దాంతో పాటు మరో 1 టీఎంసీ నీటిని తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథకు పంపింగ్ చేస్తున్నారు. వారం రోజులలో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చడానికి మరో టీఎంసీ నీటిని వాటర్ బోర్డుకు పంపింగ్ ప్రారంభించనున్నట్లు మల్లన్నసాగర్ ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎండల తీవ్రతకు రిజర్వాయర్‌లో సుమారు అర టీఎంసీ నీరు ఆవిరి కాగా ప్రస్తుతం మల్లన్నసాగర్‌లో 9.25 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నట్లు స్పష్టం చేశారు. అయితే ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేస్తారా? అన్న ప్రశ్నకు ప్రస్తుతం మాత్రం కష్టమేనని చెప్పడం గమనార్హం.

బీజేపీ ఏమిచ్చింది.. గాడిద గుడ్డు

- బీఆర్ఎస్‌లో పోటీ చేసేందుకు ఒక్కరూ లేరా?
- కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం
- సిద్దిపేట కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి
- కార్యకర్తలో జోష్ నింపిన సీఎం



కార్నర్ మీటింగ్‌కు తరలివచ్చిన జనం

మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, మే 2 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సిద్దిపేటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు జనం భారీగా తరలివచ్చారు. మీటింగ్‌లో ఆయన ఇటు బీఆర్ఎస్, అటు బీజేపీపై విమర్శల బాణం ఎక్కుపెట్టారు. పదేళ్లలో బీజేపీ తెలంగాణకు ఏమిచ్చింది గాడిదగుడ్డు.. మోదీ ఏమిచ్చారు గాడిద గుడ్డు.. రఘునందన్ ఏమిచ్చాడు గాడిద గుడ్డు... అంటూ కార్యకర్తల్లో జోష్ నింపారు. ఇక మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఒక్కరు కూడా లేరని, ఇతర ప్రాంతానికి నుంచి వెంకట్రామారెడ్డిని తీసుకువచ్చి పార్టీ అభ్యర్థిగా నిలబెట్టారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పూజాల హరికృష్ణ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమానికి జనం భారీగా తరలివచ్చారు. ముందుగా కలెక్టరేట్ వద్ద హెలిప్యాడ్ దిగిన సీఎం రేవంత్‌రెడ్డికి సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన రోడ్ షోలో ప్రజలు జననీరాజనం పలికారు. కార్నర్ మీటింగ్‌కు చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి మంత్రులుగా, వివిధ కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశమిచ్చామని, కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒక్కటేనని, రాత్రి కాగానే వారిదంతా ఒకటే మందు పార్టీ అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దుబ్బాకకు రఘునందన్‌రావు ఏం చేశాడని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. ఆగస్టు 15 లోపు రుణ మాఫీ అమలు చేస్తామని, హరీశ్‌రావు రాజీనామా చేసిన తర్వాత సిద్దిపేటకు కొత్త ఎమ్మెల్యేగా పూజల హరికృష్ణను గెలిపించుకుంటామని తెలిపారు. అనంతరం ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీసీలంతా ఐక్యంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సిద్దిపేట మీటింగ్‌కు వచ్చిన మిమ్మల్ని చూస్తుంటే మెదక్ పార్లమెంట్ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై మీరు పగ తీర్చుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని సూచించారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ సిద్దిపేటలో కార్నర్ మీటింగ్‌తో జనం ఉత్సాహం, ఆనందాన్ని నేనెప్పుడూ చూడలేదని చెప్పారు. కేంద్రం గ్యాస్ ధర పెంచితే, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి సగానికి సగం తగ్గించారని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు మీరంతా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను దీవించాలన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్, నాయకులు నిర్మలాజగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, ఎలక్షన్‌రెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, అద్దంకి దయాకర్, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయిని నరసింహారెడ్డి, రియాజుద్దీన్, బుచ్చిరెడ్డి, సాకి బాల్‌లక్ష్మిఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మీటింగ్‌లో విజిలేస్తున్న యువతి



రోడ్‌షోలో కార్యకర్తల నృత్యాలు



పూలు చల్లుతూ రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జనం



రోడ్‌షోలో సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు, సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన ఆర్.సత్యనారాయణను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సిద్దిపేటలోని హెలిప్యాడ్ వద్ద పలువురు నేతలతో ఆయన రేవంత్‌ను కలిశారు. సత్యనారాయణ వెంట బీఆర్ఎస్ నేతలు నర్సింహారెడ్డి, జిట్టి రవి, అమీనొద్దీన్, పండరి, అనంతసాగర్, ప్రభాకర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు. అయితే బీఆర్ఎస్‌లో ఆరేళ్ల ఎమ్మెల్సీ పదవిని రెండేళ్లలోపే వదులుకున్నప్పటికీ తనకు సరైన అవకాశాలు దక్కలేదనే అసంతృప్తితో సత్యనారాయణ ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన పార్టీ మారినట్లు తెలుస్తుంది.

అడుగడుగునా ఆటంకం

- నిధులు లేక నిలిచిన బస్టాండ్ల నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

గజ్వేల్, మే 2 : మూడు దశాబ్దాలుగా ప్రజ్ఞాపూర్ ప్రజల కల నెరవేరేందుకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రెండేళ్ల క్రితం రూ.3.81కోట్ల వ్యయంతో చేపట్టిన బస్టాండ్ నిర్మాణ పనులు బిల్లులు రాక, నిధులు విడుదల కాక నిలిచిపోయాయి. ఇక గజ్వేల్ బస్‌బేకు సంబంధించిన బిల్లులు విడుదల కాకపోవడంతో ఆ పనులనూ తాత్కాలికంగా నిలిపివేశారు. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పనులను నిలిపివేసినట్లు తెలుస్తుంది. బస్టాండ్ వద్ద ఆటోల రద్దీ, విద్యార్థులు, ప్రయాణికుల రద్దీతో పాటు సమీకృత మార్కెట్ ఎంట్రెన్స్ వెరసి ఆ ప్రాంతంలో ఇబ్బందులు తప్పడం లేదు. బస్‌బే నిర్మాణానికి టాయిలెట్లు కూల్చేయడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైతే ప్రయాణికులకు మరిన్ని ఇబ్బందులు తప్పేలా లేవు.

ఆర్భాటంగా పనులు ప్రారంభం

గత ప్రభుత్వ హయాంలో అనేక విమర్శల అనంతరం ఆర్భాటంగా బస్‌బే, బస్టాండ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. గతేడాది మార్చి 29న ప్రారంభించిన పనులు మొదట్లో జోరుగా సాగినా ఆ తర్వాత ఆగిపోయాయి. ఆరునెలలుగా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌ను రూ.3.81 కోట్ల వ్యయంతో, గజ్వేల్ బస్‌బేను రూ.2.51 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు పనులను చేపట్టారు. జీ ప్లస్ వన్ పద్ధతిలో ప్రజ్ఞాపూర్, గజ్వేల్ బస్‌బేను నిర్మించనుండగా కేవలం శ్లాబ్‌లు వేసి వదిలేశారు. శ్లాబ్‌లు వేసిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. ఈ క్రమంలో పనులు మళ్లీ మొదలవ్వాలంటే ప్రస్తుతం ప్రభుత్వ పెద్దలు లేదా జిల్లా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అంచనాను మించిన బడ్జెట్

ప్రజ్ఞాపూర్‌లో ఎకరం 15 గుంటల స్థలంలో నిర్మిస్తున్న బస్టాండ్ స్థలం రోడ్డుకు దాదాపుగా మూడు మీటర్ల మేర లోతుగా ఉండడంతో మట్టిని నింపడం కాంట్రాక్టర్‌కు కత్తి మీద సాములా మారింది. మట్టితో రోడ్డు ఎత్తుకు పెంచడానికే దాదాపుగా కోటికి పైగా నిధులు వెచ్చించాల్సి వచ్చింది. ఈ క్రమంలో బస్టాండ్‌కు వేసిన రూ.3.81 కోట్ల అంచనాను మించి నిధులను కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రూ.2కోట్ల మేర కాంట్రాక్టర్‌కు బిల్లులు రావాల్సి ఉండగా, అదనంగా మరో రూ.కోటి 50లక్షలను కేటాయిస్తేనే బస్టాండ్ పూర్తయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా ఈ విషయమై ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రానున్న వర్షాకాలంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా గజ్వేల్ బస్‌బే

స్ట్రాంగ్‌రూంలకు ఈవీఎంలు

- మొదటి ర్యాండమైజేషన్ పూర్తి
- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 2: ఎన్నికలకు సంబంధించి మొదటి ర్యాండమైజేషన్ పూర్తయిన ఈవీఎం కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను స్ట్రాంగ్‌రూముల్లో భద్రపర్చాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల పరిశీలకుడు సమీర్‌మాధవ్ కుర్కోటితో కలిసి గురువారం ఆయన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లా పరిధిలోని రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఈవీఎం కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు 25 శాతం, వీవీప్యాట్లు 40 శాతం అదనంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటి ర్యాండమైజేషన్ అనంతరం నియోజకవర్గం, పోలింగ్‌బూత్‌వారీగా ఏఏ యంత్రాలు కేటాయించాలో జాబితాను రూపొందిస్తున్నామని వివరించారు. ఈవీఎం యూనిట్లను పటిష్టమైన భద్రత మధ్య నియోజకవర్గాలకు తరలించి, ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరుస్తామని తెలియజేశారు. రెండో విడతలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ జరుగుతుందని తెలియజేశారు. మూడో ర్యాండమైజేషన్‌లో కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లు ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు సిద్ధం చేస్తామని వివరించారు. పోలింగ్ ఏజెంట్లను సాధ్యమైనంత త్వరగా నియమించుకోవాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు.

జీవితంపై విరక్తి చెంది కార్మికుడి ఆత్మహత్య



గోవర్ధన్‌రావుత్ (ఫైల్)

శివ్వంపేట, మే 2: ఇటుక బట్టీలో పనిచేసే కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శివ్వంపేట మండలం కొత్తపేటరూప్లా తండాలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రానికి చెందిన గోవర్ధన్‌రావుత్(24) వరుసకు అన్న అయిన కైలాస్ రావుతో కలిసి ఆరునెలల క్రితం రూప్లాతండాలో దేవాదత్‌రామ్‌సింగ్ దగ్గర ఇటుక బట్టీలో అక్కడే ఉండి పనిచేస్తున్నాడు. ఈ నెల 1న గోవర్ధన్‌రావుత్ ఉదయం నర్సాపూర్‌కు వెళ్లి తిరిగి రాత్రి 9 గంటలకు తండాకు వచ్చి వాంతులు చేసుకుంటున్నాడు. కైలాస్‌రావుత్ ఏమైందని అడగ్గా పురుగుల మందు తాగానని చెప్పాడు. వెంటనే బట్టీ యజమాని రామ్‌సింగ్‌కు సమాచారం అందించడంతో పాటు గోవర్ధన్‌రావుత్‌ను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతిచెందినట్లు చెప్పారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహిపాల్‌రెడ్డి తెలిపారు.

స్క్రాప్ గోడౌన్‌లో మంటలు

పటాన్‌చెరు, మే 2: స్క్రాప్ గోడౌన్‌లో మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైన సంఘటన గురువారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణ శివారులో చోటు చేసుకున్నది. పటాన్‌చెరు శివారులోని నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు ముత్తంగి జంక్షన్ సమీపంలో పోచారం చౌరస్తా వద్ద పూజా ఎంటర్‌ప్రైజెస్ స్క్రాప్ గోడౌన్‌లో విద్యుదాఘాతంతో మంటలు ఎగిసిపడ్డాయి. పెద్దఎత్తున నిల్వచేసిన ప్లాస్టిక్, అట్టలు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతైంది. సమాచారమందుకున్న పటాన్‌చెరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ఔటర్ రింగ్ రోడ్డు, జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు ఎగసిపడుతున్న నల్లని పొగ చూసి ఆందోళనకు గురయ్యారు. ప్రమాదంలో జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీలు

నారాయణఖేడ్, మే 2: ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల్లో 85 ఏళ్ల పైబడి వయస్సు గల వృద్ధులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. శుక్రవారం ఇంటి నుంచి ఓటు ప్రక్రియ ప్రారంభంకానున్నది. దీంతోపాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకుంటారు. ఆయా వాటి కోసం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి ఎన్నికల అధికారులు బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. గురువారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్థానిక ఆర్డీవో అశోక చక్రవర్తి పర్యవేక్షలో ప్రిసైడింగ్ అధికారి కళింగ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో అధికారులు బ్యాలెట్ బాక్సులకు సీలు వేశారు. అనంతరం ఆర్టీసీ డీఎం మల్లేశయ్యతో ఆర్డీవో సమావేశమై ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన బస్సులను, డీజీటీ వాహనాలను సిద్ధం చేయాలని సూచించారు.



ఖేడ్‌లో హోం ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్ బాక్సులకు సీలు వేస్తున్న అధికారులు

హజ్ యాత్రికులకు ఫిట్‌నెస్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, మే 2: సంగారెడ్డి గంజిమైదాన్‌లోని ఓ ప్రార్థనా మందిరంలో హజ్‌కు వెళ్లే యాత్రికులకు గురువారం ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ నేతృత్వంలోని డాక్టర్ల బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. అంతేకాకుండా ఓరల్ పోలియో, సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా, మెనిన్‌గోకోకల్ మెనిన్‌జైటీస్ వ్యాక్సిన్ టీకాలు ఇచ్చారు. అనంతరం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకుని సుమారు వందమంది యాత్రికులకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ చేతులమీదుగా ఫిట్‌నెస్ సర్టిఫికేట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్, డా.పద్మావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హజ్ యాత్రికుడికి ఫిట్‌నెస్ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్

చోరీ కేసులో ముగ్గురికి రిమాండ్

మనోహరాబాద్, మే 2: మూతపడ్డ పరిశ్రమలో చోరీకి పాల్పడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న బీఎస్ పరిశ్రమ కొన్నేళ్ల క్రితం మూసేశారు. గురువారం ఉదయం పోలీసులు దండుపల్లి చౌరస్తా రోడ్డుపైన వాహనాలు తనిఖీ చేస్తుండగా 200 కేజీల ఇనుప సామగ్రితో వెళ్తున్న ఆటోను పట్టుకున్నారు. నెలరోజుల క్రితం మూతపడిన పరిశ్రమంలో దొంగతనం చేశామని రంగాయపల్లి గ్రామానికి చెందిన కుంట స్వామి, గరికపాటి శరత్, కుంట రాజు ఒప్పుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మండుటెండల్లో మల్లన్న భక్తుల ఇక్కట్లు

● ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని వేడుకోలు

చేర్యాల, మే 2 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో నిలువనీడలేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకూ ఎండలు మండిపోతుండటంతో ఎండతీవ్రత తట్టుకోలేక పడరాని పాట్లు పడుతున్నారు. ఆలయ వీధుల్లో చలువ దనానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో, మధ్యాహ్న సమయంలో భక్తులు ఎండ వేడిని తట్టుకోలేకపోతున్నారు. నిలువనీడతో పాటు కాళ్లు గజ్వేల్ కాలకుండా ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



రాయపోల్: సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

రాంసాగర్‌లో ఘనంగా సీతారాముల కల్యాణం

రాయపోల్ /గజ్వేల్, మే 2: మండలంలోని రాంసాగర్‌లో శ్రీరామనవమి తర్వాత పదిహేను రోజులకు రామాలయం వార్షికోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. సీతారాముల కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోశ్చరణలు, మేళతాళల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. సీతారాముల కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం రథోత్సవం నిర్వహించడం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గజ్వేల్ పట్టణంలో ప్రాచీన చరిత్ర కలిగిన శ్రీసీతారామా, ఉమామహేశ్వర స్వామి కల్యాణోత్సవ వేడుక గురువారం రాత్రి రమణీయంగా సాగింది. గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట హనుమాన్ ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాల ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారుల నృత్యాలు, జయజయధ్వానాల మధ్య శ్రీరామ, మహేశ్వరుల ఎదుర్కోళ్లను అట్టహాసంగా నిర్వహించి, కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. కల్యాణ వేదికపై ఆది దంపతులైన ఉమామహేశ్వరులు, ఆదర్శ దంపతులైన శ్రీసీతారాములను ఉంచి కల్యాణ వేడుకను నిర్వహించారు. బ్రాహ్మణుల వేదమంత్రోచ్చారణల కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దంపతులు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రావు, నాయకులు హాజరయ్యారు.



గజ్వేల్ పట్టణంలో సీతారామ, ఉమామహేశ్వరుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

'మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేద్దాం'

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముండ్రాతి కృష్ణ

గజ్వేల్, మే 2: మాదిగలకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క సీటు ఇవ్వకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ, మే 4న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద నిర్మహించే మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముండ్రాతి కృష్ణ, ఎంఎస్‌పీ సీనియర్ నేత మైస రాములు పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో గురువారు వారు విలేకరులతో మాట్లాడుతూ.. చలో ఇందిరాపార్కు సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు హాజరుకానున్నారని తెలిపారు. తెలంగాణలో జనాభాలో అత్యధిక శాతం ఉన్న మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకుండా మాదిగల అస్తిత్వాన్ని, ఆత్మగౌరావాన్ని దెబ్బతీసిన కాంగ్రెస్, సీఎం రేవంత్‌రెడ్డికి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగ ప్రజలు, యువకులు, మేధావులు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కోరారు. వారితో ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మాధవి, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ శనిగారి రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మని మహేష్, ములుగు మండల అధ్యక్షుడు కొక్కొండ నర్సింహులు, నాయకులు పైసా బాబు, దినేష్, మహేష్ ఉన్నారు.



హత్నూర మండలం దౌల్తాబాద్ కార్నర్ మీటింగ్‌కు భారీగా హాజరైన జనం



హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ గుమ్మడిదల నాయకుడు పోచుగారి మోహన్‌రెడ్డి

కాంగ్రెస్ బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయి

- హామీల అమలులో విఫలం
- నమ్మి ఓటేస్తే ఆగం చేశారు
- కేసీఆర్ ప్రజలను గుండెల్లో పెట్టి చూసుకున్నారు
- బీజేపీ అభ్యర్థి బ్లాక్‌మెయిలర్, కాంగ్రెస్ అభ్యర్థి ఆరో తరగతి
- ఉన్నత విద్యావంతుడైన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిదే గెలుపు
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

హత్నూర/గుమ్మడిదల/జిన్నారం, మే 2: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక హామీలతో కూడిన బాండ్ పేపర్ ప్రజలకు రాసిచ్చారని, అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా వాటిని అమలు చేయలేకపోయారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాండ్ పేపర్ కాలపరిమితి పూర్తయినందున, చెక్ బౌన్స్‌లా బాండ్‌పేపర్ హామీ బౌన్స్ అయిందని, హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ కు ఓటుతోనే బుద్ధి చెప్పాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరఫున సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధి దౌల్తాబాద్‌లో, మండల కేంద్రమైన గుమ్మడిదల, జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపాలిటీలో గురువారం రాత్రి రోడ్‌షోలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసేందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏ పార్టీతో జతకట్ట లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలను కేసీఆర్ గుండెల్లో పెట్టి చూసుకున్నారని, కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే ఆగం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నిలువునా మోసం చేసిందన్నారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క ఫ్రీ బస్సు తప్ప మిగతావన్నీ తుస్సేనని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నెలలో లక్ష పెళ్లిలు అయ్యాయని, వారందరికీ తులం బంగారం, లక్ష రూపాయలు ఎప్పుడు ఇస్తారో చెప్పాకే కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగాలన్నారు. ఒకడేమో దేవుని చూపించి ఓట్లు అడుగుతున్నాడని, ఇంకొకడేమో దేవుడిపై ఒట్టు వేసి అడుగుతున్నాడని, ఈ రెండు పార్టీలు తోడుదొంగలని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 12 విడతలుగా రూ.72,000 కోట్ల రైతుబంధు ఇచ్చి అండగా నిలిచామని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా.. పూర్తిస్థాయిలో రైతుబంధు ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ప్రజలను రెచ్చగొట్టి, కుటుంబాలను విడగొట్టి ఓట్లు దండుకోవాలని కుట్ర పన్నుతున్నారని అన్నారు. బీజేపీ అభ్యర్థి బ్లాక్‌మెయిలరని అన్నారు. ఆరో తరగతి చదివిన కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేస్తే పార్లమెంట్‌లో ఏం మాట్లాడుతాడో ఎవరికీ తెలియదన్నారు అదే వెంకట్రామారెడ్డి ఉన్నతవిద్యావంతుడని, కలెక్టర్‌గా పనిచేశారని, పటాన్‌చెరు ముద్దుబిడ్డగా పోటీ చేస్తున్నాడని తెలిపారు. వెంకట్రామారెడ్డి రెండు లక్షల మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు.



బొల్లారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తదితరులు

కేసీఆర్‌ను మోసం చేసిన మదన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి కేసీఆర్‌కు మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇసుక, మట్టి, బియ్యం దొంగలకు అండగా ఉండేందుకే అధికార కాంగ్రెస్ పార్టీ తలుపు తట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు సన్నిహితుడనంటూ చెప్పుకున్న మదన్‌రెడ్డి కష్టకాలంలో అండగా ఉండాల్సింది పోయి అధికారం కోసం కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఇంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఎవరు వీడిన ఒరిగేదిలేదన్నారు. గులాబీ సైనికులను కడుపులో పెట్టి కాపాడుకుంటామని ఆయన స్పష్టం చేశారు. గుమ్మడిదల కార్నర్ మీటింగ్‌లో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు సంఘం అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు సద్ది ప్రవీణ భాస్కర్ రెడ్డి, వావిలాల నర్సింలు, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, కౌన్సిలర్ హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి: ఎమ్మెల్యే



పటాన్‌చెరు: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 2: బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర హక్కు కోసం కేంద్రంతో కొట్లాడే సత్తా కేవలం బీఆర్ఎస్‌కే ఉన్నందున పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని ఆల్విన్‌కాలనీ, చైతన్యనగర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో వెంకట్రామారెడ్డి సతీమణి, ప్రణీతరెడ్డి, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ, జడ్పీటీసీ సుప్రజ, తెల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ లలితాసోమిరెడ్డి, మాజీ ఎంపీపీ గాయత్రీపాండు, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ.అఫ్జల్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు దారి చూపే వ్యక్తికి ఓటేయాలి

కొండాపూర్, మే 2: తన తండ్రి ట్రస్టుల ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేశారని, నిరుద్యోగ యువతకు ఉచిత ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి ఉపాధి కల్పనకు దారి చూపే వ్యక్తికి ఓటు వేయాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తనయుడు సుజిత్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కొండాపూర్, హరిదాస్‌పూర్, తమ్మలిబాయ్‌తండాలో మండల నాయకులతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఎంపీ ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. ఎకరాకు రూ.15 వేల రైతుబంధు, రూ.2 లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. అభివృద్ధిలో ప్రథమస్థానంలో నిలిపిన బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో పార్టీ మండలాధ్యక్షుడు విఠల్, మాజీ సర్పంచులు గోవర్ధన్‌రెడ్డి, పాండు రంగారాం, ప్రకాశ్, ఫహీమ్, సత్యానందం, సీనియర్ నాయకులు మల్లాగౌడ్, ప్రేమానందం పాల్గొన్నారు.

వెంకట్రామారెడ్డి గెలుపు కోసం కొడుకు, కోడలు ప్రచారం

రామాయంపేట, మే 2: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గెలుపు కోసం కుమారుడు భరత్‌రెడ్డి, కోడలు స్నేహారెడ్డి గురువారం రామాయంపేట పట్టణంలో పాదయాత్ర చేపట్టారు. ఉదయం నుంచి పట్టణ పురవీధుల గుండా ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరినీ కలుస్తూ మా అంకుల్‌కు ఓటేయాలని స్నేహారెడ్డి కోరగా.. మా డాడీని గెలిపించాలంటూ భరత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



రామాయంపేటలో వెంకట్రామారెడ్డి గెలుపు కోసం ప్రచారం చేస్తున్న కొడుకు, కోడలు

కాంగ్రెస్ గెలిస్తే దేశంలో ప్రతీరోజు బాంబులు పేలుతాయ్!

- నరేంద్రమోదీకి ఓటేస్తే దీపావళి ఒక్కరోజే..
- ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్
- డబ్బుతో ఎంపీ టికెట్ కొనుక్కున్న వెంకట్రామారెడ్డి
- చిన్నకిష్టాపూర్, కుకునూరుపల్లి రోడ్‌షోలో రఘునందన్‌రావు

కుకునూరుపల్లి, మే 2: కాంగ్రెస్ గెలిస్తే దేశంలో రోజు బాంబులు పేలుతాయని, నరేంద్రమోదీకి ఓటు వేస్తే ఒక్క దీపావళి రోజు మాత్రమే పేలుతాయని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లాలోని కుకునూరుపల్లి మండల కేంద్రం, చిన్నకిష్టాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులకు ద్రోహం చేసి జిల్లాతో సంబంధం లేని వ్యక్తిని బీఆర్ఎస్ మెదక్ నుంచి బరిలో నిలిపిందన్నారు. డబ్బు సంచులతో ఎంపీ టికెట్ కొనుక్కున్న వ్యక్తి వెంకట్రామారెడ్డి అని విమర్శించారు. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్ భూ బాధితులకు అన్యాయం చేసి డబ్బు సంపాదించిన వెంకట్రామారెడ్డికి బుద్ధి చెప్పాలన్నారు. వెంకట్రామారెడ్డికి ఓటు వేస్తే మీ దగ్గర ఉన్న భూములు లాక్కొని, తన పేరున పట్టా చేయించుకునేంత సమర్థుడని ఆరోపించారు. కాంగ్రెస్ ఈ దేశంలో అధికారం ఉన్నన్ని రోజులు ఎక్కడ బాంబులు పేలుతాయో తెలిసేది కాదని, నరేంద్రమోదీ ప్రభుత్వం తొమ్మిది నెలల దేశంలో ఎక్కడా ఉగ్రవాదుల ఆనవాళ్లు లేకుండా చేసిందన్నారు. సుస్థిరమైన ప్రభుత్వ ఏర్పాటుకు నరేంద్రమోదీకి ఓటు వేయాలని కోరారు. గజ్వేల్‌కు ఎమ్మెల్యే కేసీఆరా.. లేక హరీశ్‌రావా అని అనుమానం వస్తున్నదన్నారు. బీఆర్ఎస్‌కి ఓటు వేస్తే కేసీఆర్ గెలిచేది లేదని, ఆయన ముఖ్యమంత్రి అయ్యేది లేదన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితం అవుతాడన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కాంగ్రెస్... రాజ్యాంగాన్ని వందసార్లు మార్చింది

గజ్వేల్, మే 2: భారతదేశానికి రాజ్యాంగం వచ్చిన 75 ఏళ్లలో ఇప్పటికి రాజ్యాంగాన్ని 126 సార్లు మారిస్తే కాంగ్రెస్ పార్టీయే వందసార్లు మార్చిందని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ కొత్తగా రిజర్వేషన్లను ఇచ్చామని, ఏనాడు భారత రాజ్యాంగాన్ని అవమానపర్చలేదన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి వచ్చే వానాకాలం సీజన్‌పై ఫోకస్ పెట్టాలని, రైతులకు రూ.15వేలు రైతుబంధు ఇవ్వాలని, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

ఓటర్లలో చైతన్యం అత్యవసరం

● జాగో రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి



పట్టణంలో నిర్వహించిన ఓటరు చైతన్య బస్సుయాత్రలో పాల్గొన్న జాగో రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి

జహీరాబాద్, మే 2: ఓటర్లలో చైతన్యం వచ్చేవరకు పాలకుల్లో మార్పురాదని, దీంతో అన్నిరంగాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని జాగో రాష్ట్ర కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. తెలంగాణ సోషల్ డెమోక్రటి ఫోరం, జాగో తెలంగాణ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బస్సు చైతన్యయాత్ర గురువారం జహీరాబాద్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజల వద్ద నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.12 లక్షల కోట్లను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేయలేదన్నారు. అయితే రూ.16 లక్షల కోట్లను అదానీ, అంబానీలకు దోచిపెట్టిన ఘనత బీజేపికే దక్కిందన్నారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని ప్రమాదస్థాయిలోకి తీసుకెళ్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని గద్దెదించేందుకు అందరం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కులం, మతం, దేవుళ్ల పేరుతో ప్రజల్లోకి వెళ్లి ఓట్లడగడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తానని, నల్లధనాన్ని వెలికితీసి ప్రజలకు పంచుతానని చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటివరకు బీసీ గణన చేపట్టలేదని ఆయన గుర్తు చేశారు. కుల, మతాల మధ్య చిచ్చుపెడుతున్న మోదీని గద్దెదించేందుకు అందరం సంఘటితం కావాల్సిన అవసరం ఉన్నదన్నారు. నరేంద్ర మోదీ ప్రజల సంక్షేమాన్ని, సుస్థిర అభివృద్ధిని మరిచి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ప్రజల్లో మార్పు అత్యవసరమన్నారు. సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు నిర్ణయించాల్సిన బాధ్యత ఓటర్లదేనని, ఓటువేసే ముందు ఎవరు సమర్థులో, ఎవరు అసమర్థులో నిర్ణయించి ఓటువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు లక్ష్మీనారాయణ, పద్మజాషా, డీడీఎఫ్ శంకర్, జేవి చలపతిరావు, గోవర్ధన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, జనార్ధన్, కల్పన, నిర్మల, స్వరూప, మసూద్, సురేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యేనా?

- కొత్త జిల్లాల ఏర్పాటుతో ముక్కలు, చెక్కలు
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నేరవేర్చాలని వేడుకోలు

చేర్యాల, మే 2: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజలు ఎదుర్కుంటున్న రెవెన్యూ డివిజన్ సమస్యకు పరిష్కారం ఎప్పుడోనని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమైక్యాంధ్ర పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దులో ఉన్నా.. రెవెన్యూ పర కష్టాలు ఎదుర్కోలేదు. సిద్దిపేటతో ఉన్న అనుబంధం దృష్ట్యా తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచినా.. స్వపరిపాలనలో మాత్రం చేర్యాల, మద్దూరు మండలాలు ముక్కలు, చెక్కలవడంతో రెవెన్యూ కష్టాలు వదలేక ప్రజలు తంటాలు పడుతున్నారు. గతంలో తాలూకా, టౌన్ మునిసిపాలిటీ, నియోజకవర్గ కేంద్రంగా కొనసాగిన చేర్యాల 2009లో పునర్విభజనలో నియోజకవర్గ హోదా కోల్పోవడంతో వెనకబాటుకు గురైంది.

తలోదిక్కూ నాలుగు మండలాలు

చేర్యాలను చీల్చి కొమురవెల్లిని మండలంగా ఏర్పాటుచేశారు. రెండు మండలాలను రెవెన్యూపరంగా సిద్దిపేట ఆర్డీవో పరిధిలో చేర్చారు. మద్దూరు మండలాన్ని హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్‌లో చేర్చారు. పోలీస్, ట్రాన్స్‌కో శాఖలను హుస్నాబాద్ డివిజన్ పరిధికి చేర్చి.. వ్యవసాయశాఖను గజ్వేల్ డివిజన్‌కు చేర్చారు. మద్దూరును చీల్చి ధూళిమిట్ట మండలంగా ఏర్పాటు చేశారు. మద్దూరు మండలంలోని కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాలను చేర్యాల మండలంలో విలీనం చేశారు. నాలుగు మండలాల ప్రజలు కోర్టు పనులకు సిద్దిపేట, హుస్నాబాద్‌లకు వెళ్తున్నారు. జిల్లా సిద్దిపేట, నియోజకవర్గం జనగామ, భువనగిరి పార్లమెంట్ పరిధిలో కొనసాగుతుండటానికి తోడు డివిజన్ల విషయంలోనూ మూడేసి ప్రాంతాలకు కేటాయింపజేయడంతో ప్రజలే కాక ప్రజాప్రతినిధులకు తిప్పలు తప్పడం లేదు.

ఓ మండల వాసులు మరో మండల పోలీస్‌స్టేషన్‌కు....

చేర్యాల మండలంలోని నాగపురి, షబాషీగూడెం, పెద్దరాజుపేట, వేచరేణి గ్రామాలు కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చేర్చారు. రెవెన్యూపరంగా చేర్యాలకు వెళ్తుండగా, వివాదాలు, తగాదాలు, ఇతరత్రా సమస్యల పరిష్కారానికి కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్నారు. చేర్యాలలో విలీనమైన కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామస్థులతో పాటు ధూళ్మిట్ట మండలవాసులు మద్దూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తూ ఇక్కట్ల పాలవుతున్నారు.

చాన్నాళ్లుగా ఆందోళనలు

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని చాన్నాళ్లుగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ విషయమై భువనగిరి మాజీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మూడున్నరేళ్ల క్రితం చేర్యాలలో ఒకరోజు దీక్ష చేపట్టడంతో పాటు జనగామ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో ప్రస్తావించారు. గతంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వీరికితోడు రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు కొనసాగించారు. అలాగే నాలుగు మండలాల్లోని గ్రామపంచాయతీల ఏకగ్రీవ తీర్మానాలను మాజీ మంత్రి హరీశ్‌రావుకు అందించడంతో నవంబరు 2019లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విన్నవించారు. స్పందించిన అప్పటి సీఎస్ సోమేష్‌కుమార్ నివేదిక అందించాలని జిల్లా అధికారులను ఆదేశించడంతో కాస్త కదలిక వచ్చిందని భావించినా మూడేళ్లుగా ఇప్పటికీ స్పష్టత రాలేదు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డితో సహా, పలువురు ప్రజాప్రతినిధులు హామీఇచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున రెవెన్యూ డివిజన్ సమస్య పరిష్కారానికి నోచుకుంటుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.



చేర్యాల పట్టణ వ్యూ



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్ రాజనర్సింహ

ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్

● రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

వట్‌పల్లి, మే 2: కాంగ్రెస్ మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. గురువారం మేడుకుంద శివారులోని ఆర్ఎస్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన యువజన కాంగ్రెస్, సోషల్ మీడియా, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని చెప్పారు. గతంలో లింగాయత్‌లను ఓబీసీలోకి చేర్చిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. భవిష్యత్‌లో 50 శాతం సీట్లను యువతకే కేటాయించనున్నామని చెప్పారు. కార్యకర్తలందరూ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్ జోషి, వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్, యూత్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి..

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వేలేటి రాధాకృష్ణశర్మ

కొండపాక, మే 2 : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేలేటి రాధా కృష్ణశర్మ పేర్కొన్నారు. మండలంలోని దుద్దెడ, రవీంద్రనగర్, విశ్వనాథపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమలు కానీ హామీలు ఇచ్చి గద్దె నెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, మాజీ ఎంపీపీలు బుద్ధుల కనకయ్య, రాధా కిషన్‌రెడ్డి , గోనె శ్రీనివాస్, దోమల ఎల్లం, మంచాల శ్రీనివాస్, గుండెల్లి ఆంజనేయులు పెద్దంకుల శ్రీనివాస్, వేముల రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

- **దుబ్బాక:** కేసీఆర్‌ను బద్నాం చేయడానికే మూడేళ్ల నీటినిలువలను కాంగ్రెస్ ప్రభుత్వం కిందికి వదిలి, కావాలనే కరువు పరిస్థితులను సృష్టించిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం దుబ్బాక మున్సిపాలిటీ రేకుల కుంట మల్లికార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని రాజక్కపేట గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుచూపుతో కరువును ఎదుర్కొనేందుకు మేడిగడ్డ, కాళేశ్వరం, మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, కొండపోశమ్మ ప్రాజెక్టులను నిర్మించారని, వాటిద్వారా మూడేళ్ల కరువుకు కూడా ఎదురుకునే ముందుచూపు మాజీ సీఎం కేసీఆర్ విజన్‌లో ఉందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని కోరారు. ఆయన వెంట నాయకులు భోంపల్లి మనోహర్‌రావు, ఆర్. రాజమౌళి, వెంకటనర్సింహరెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి తదితరులున్నారు.

- **రాయపోల్:** బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం ఆయన రాయపోల్ మండలం ఎల్కల్, బేగంపేట తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఆయనవెంట ఎంపీటీసీ వెంకటయ్య, నాయకులు లచ్చయ్య, మంజూరు తదితరులు ఉన్నారు.



రాయపోల్: ఎల్కల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్

- **దౌల్తాబాద్:** దౌల్తాబాద్‌లోని గాజులపల్లి, దొమ్మాట గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కరపత్రాలను అందజేసి, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దార సత్యనారాయణ, మోహన్‌రావు, నర్ర రాజేందర్, హమ్మద్, పూజీత వెంకట్‌రెడ్డి, శ్రీనావాస్, బాల్‌రెడ్డి, బొల్లి చంద్రం, సత్తయ్య, భిక్షపతి, నీఖిల్‌రెడ్డి, రాములు, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని మాచిన్‌పల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా దుబ్బాక నియోజక వర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వెంట ఎంపీటీసీ మల్లేశం, రవీందర్ ఉన్నారు.

- **ములుగు:** మండలంలోని తునికిబొల్లారంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, ఎంపీటీసీలు నవ్యశ్రీ రాజేందర్‌రెడ్డి, కొన్యాల మమత బాల్‌రెడ్డి, లింగారెడ్డి, జుబేర్, మాజీ సర్పంచులు గణేష్, బాలేష్, చంద్రం, బాలకృష్ణ, గణేష్, వెంకటరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అశోక్, స్వరూప్‌రెడ్డి, రైతు సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల బీసీసెల్ అధ్యక్షుడు పల్లె బాబు, మండల రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మర్కుక్: ఇప్పలగూడెంలో ఓటు వేయాలని ఉపాధిహామీ కూలీలను కోరుతున్న నాయకులు

- **కుకునూరుపల్లి:** లకుడారం, ముద్దాపూర్, చిన్నకిష్టాపూర్ గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింట ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, పార్టీ సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి, కోలా సద్గుణ, అమరేందర్, లక్ష్మణ్‌రాజ్, భూములు గౌడ్, మాజీ సర్పంచులు భద్రప్ప, కోల శ్రీనివాస్, మహిపాల్, కిరణ్, కనకయ్య, బాల్‌నర్సయ్య, రిప్పల స్వామి, వెంకటరెడ్డి, కరుణాకర్, కంకణాల మల్లేశం, దేవి నర్సింహులు, యాదగిరి, బిక్షపతి, రాజు, సంతోష్, బాబు, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- **మర్కుక్:** మండలంలోని ఇప్పలగూడెం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం ఇప్పలగూడెం చెరువుశిఖం వద్ద ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మర్కుక్ మండల ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, స్థానిక తాజా మాజీ సర్పంచ్ ప్రసన్న సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణాయాదవ్, బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య, వంటిమామిడి ఏఎంసీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్‌గౌడ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కొండపాక: దుద్దెడలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- **మిరుదొడ్డి:** మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్‌రాజులు, నాయకులు తోటకమలాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, సుకూరి లింగం, సత్యనారాయణ, బాపురెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి తరపున..

బెజ్జంకి, మే 2: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి గద్దెకెక్కిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని కల్లేపల్లి, గుగ్గిళ్ల, బెజ్జంకి గ్రామాల్లో బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తరఫున గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ఉపాధిహామీ కూలీలకు వివరించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆగం చేసిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ తెలంగాణకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మి మాయలో పడద్దని హితవుపలికారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజయ్య, మల్లేశం, శేఖర్ బాబు, నరేష్, తిరుపతి, మోహన్, జగన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాగులోపడి వృద్ధురాలి మృతి



మైసవ్వ (ఫైల్)

తొగుట, మే 2: కూడవెళ్లి వాగులో పడి వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన మండల కేంద్రమైన తొగుటలో గురువారం వెలుగుచూసింది. తొగుట పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాసర్ల మైసవ్వ (62)కు ఇద్దరు కొడుకులు ఒక కూతురు ఉన్నారు. ఆమె మతిస్థిమితం తప్పడంతో చిన్న కుమారుడు కనకయ్య ఇంటి వద్దనే ఉంటోంది. ఈ నెల 1న ఉదయం మైసవ్వను కనకయ్య తొగుట ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించి ఇంటి మార్గ మధ్యంలో దించి, పని మీద బయటకు వెళ్లిపోయాడు. రాత్రి వరకు మైసవ్వ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఊరంత వెతికినా కనిపించలేదు. గురువారం గ్రామ శివారులోని కూడవెళ్లి వాగులో మహిళ శవం ఉందని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి చూసి మైసవ్వగా గుర్తించారు. మృతురాలి పెద్దకొడుకు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఏఎస్ఐ రాంరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో..

సిద్దిపేటరూరల్, మే 2: ఎదురెదురుగా టాటాఏసీ, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా రూరల్ మండలంలోని పుల్లూరుబండ శివారులో గురువారం చోటుచేసుకున్నది. టాటాఏసీ పుల్లూరు మీదుగా మల్యాల గ్రామానికి వెళ్తున్నది. అదే సమయంలో రూరల్ మండలం బండచెర్లపల్లికి చెందిన నాగరాజు (40) బైక్‌పై మల్యాల నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సిద్దిపేట పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు..

నంగునూరు, మే 2: రెండో అంతస్తు నుంచి కాలుజారి కిందపడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం నంగునూరులో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన గరిపల్లి ఎల్లయ్య (57) భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. రోజువారి కూలీ పనిలో భాగంగా రెండో అంతస్తులో సెంట్రింగ్ పనులు చేస్తూ, ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాలపేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

సరిహద్దులు తెలియని అభ్యర్థులకు గుణపాఠం చెప్పండి

- సీపీఎం భువనగిరి అభ్యర్థి ఎండీ. జహాంగీర్

చేర్యాల, మే 2: నియోజకవర్గ సరిహద్దులు తెలియకపోవడమే కాకుండా ప్రజాసమస్యలపై కనీస అవగాహనలేని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు గుణపాఠం చెప్పాలని, పోరాటాల వారసత్వం కలిగిన తనను ఆదరించి గెలిపిస్తే పార్లమెంటులో ప్రజాగొంతుకనవుతానని సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ. జహాంగీర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం చేర్యాల మండలకేంద్రంలోని గాంధీచౌక్ నుంచి అంగడిబజారు వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల, ఐనాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, నాయకులు ఎండీ. అబ్బాస్, మోకు కనకారెడ్డి, అందె బీరయ్య, కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, భాస్కర్, కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు సన్మానం



విద్యార్థిని నందినిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కొల్చారం, మే 2: కొల్చారం మండలం రంగంపేట గ్రామానికి చెందిన ఎరుకల నందిని 10వ తరగతిలో 10జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఆమెను బీజేపీ మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్ గురువారం సన్మానించారు. పేద కుటుంబంలో పుట్టిన నందిని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన కాంక్షించారు. కార్యక్రమంలో రంగంపేట బూత్ అధ్యక్షుడు గిరి, పోచేందర్, గంగరాజు, బీజేపీ నాయకులు గుండు నాని, వెంకట్, రవితేజ, దుర్గేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

చిన్నశంకరంపేట, మే 2: మండలంలోని కొర్విపల్లి గ్రామంలోని పాత నర్సరీలో మొక్కలను దుర్వినియోగం చేస్తున్నారని కొందరు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎంపీడీవో దామోదర్ గురువారం గ్రామానికి వెళ్లి నర్సరీలోని మొక్కలను పరిశీలించి విచారణ జరిపారు. నర్సరీలో పది వేల మొక్కలను పెంచగా.. 5,500 మొక్కలు హరితహారంలో వినియోగించారని ఎంపీడీవో వెల్లడించారు. మిగిలిన 2,550 మొక్కలను కొత్త నర్సరీకి తరలించారని చెప్పారు. 2024కు సంబంధించి చనిపోయిన మొక్కలను తొలగించే సమయంలో లెక్కించడంలో తేడా వచ్చినట్లు తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



రాంపూర్‌లో మజ్జిగ ప్యాకెట్లను అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొల్చారం, మే 2: కొల్చారం మండలం రాంపూర్‌లో ఉపాధి కూలీలకు బీజేపీ నాయకులు గురువారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు అక్కుల కృష్ణ, పాశం అంజనేయులు, దాకమ్మ శేఖర్, చాకలి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు, రూ.32,500 సీజ్

జహీరాబాద్, మే 2: జహీరాబాద్ పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న గుర్రం శ్రీనివాస్‌ను బుధవారం రాత్రి అరెస్టు చేసి చేసి పట్టణ పోలీసులకు అప్పగించామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. అందులో భాగంగా నమ్మదగ్గ సమాచారం మేరకు జహీరాబాద్ పట్టణంలోని శ్రీరాంమహేళాకు చెందిన గుర్రం శ్రీనివాస్ మట్కాను నిర్వహిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి తనిఖీలు చేసి, పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద మట్కాచిట్టీలు, మట్కాబుక్, సెల్‌ఫోన్‌తో పాటు రూ.32,500 నగదు సీజ్‌చేసి పట్టణ పోలీసులకు అప్పగించామన్నారు.

నేడు కొల్చారంలో బీఆర్ఎస్ పార్టీ కార్నర్ మీటింగ్

కొల్చారం, మే 2: మండల కేంద్రమైన కొల్చారంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు బీఆర్ఎస్ పార్టీ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు కొల్చారం మండల బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు గురువారం తెలిపారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

గజ్వేల్‌టౌన్, మే 2: గజ్వేల్‌లోని అంగడిపేట్ హనుమాన్ ఆలయం వద్ద గురువారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, వాసవిక్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్, కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్‌లు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అన్నారు. కార్యక్రమంలో కిరాణ అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, పడకంటి రవి, అత్తెల్లి లక్ష్మయ్య, కైలాస ప్రభాకర్, లయన్ నేతి శ్రీనివాస్, లయన్ గుడాల రాధాకృష్ణ, రవీందర్, కైలాస ప్రశాంత్, ఉమేష్, సిరిపురం సత్యనారాయణ, తెరల రాజులు, బుస్సా శ్రీనివాస్ రాణి, బుస్సా నితీష్, చంద్రశేఖర్, బెజుగామ రాము, దూబకుంట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాల అందజేత

గజ్వేల్, మే 2: గజ్వేల్ పట్టణంలోని శ్రీసీతారామ, ఉమామహేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు గోటి తలంబ్రాలు, భద్రాచల ముత్యాల తలంబ్రాలను గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం అధ్యక్షుడు రామరాజు అందజేశారు. పట్టణంలోని ఆలయంలో గురువారం ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, ఆలయ పూజారులు బీట్కూరి శ్రీనివాసాచార్యులు, మఠం శివకుమార్, చాడ నంద బాల శర్మలకు రామరాజు దంపతులు తలంబ్రాలను అందజేశారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యదర్శి రాధాకృష్ణశర్మ ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారితో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

6న బసవేశ్వర విగ్రహావిష్కరణ

రేగోడు, మే 2: విశ్వగురు మహాత్మా బసవేశ్వర విగ్రహాన్ని ఈ నెల 6న రేగోడు బసవేశ్వర చౌక్ వద్ద ఆవిష్కరించనున్నట్లు వీరశైవ లింగాయత్ నాయకులు గురువారం తెలిపారు. ఆవిష్కరణ మహోత్సవానికి బిచ్కుంద పీఠాధిపతి సోమలింగ శివాచార్య మహరాజ్, బాల్కి బసవ కళ్యాణ్ పీఠాధిపతి బసవలింగ పట్టాదేవరు హాజరుకానున్నట్లు తెలిపారు. 6న ఉదయం బసవేశ్వరుని శోభయాత్ర అనంతరం విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కిశాంక్‌ను విడుదల చేయాలి

చిన్నశంకరంపేట, మే 2: బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె క్రిశాంక్‌ను రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సవాళ్లను ఎదుర్కోలేకనే అక్రమ అరెస్టులు చేస్తుందని మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లు మూసివేతపై సోషల్ మీడియాలో ఫేక్ సర్క్యులర్లను ఉంచారంటూ అక్రమ కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

ఇంటి వద్దనే పోలింగ్



గండవ్వ

దౌల్తాబాద్/రాయపోల్, మే 2: పార్లమెంట్ ఎన్నికల్లో కూడా 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు, 40శాతం పైగా వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. దీని కోసం 12డీ ఫారం ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఇటీవలే పూర్తి కాగా, 17 మంది ఓటర్లను గుర్తించారు. మండలంలో గురువారం 80 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధుల ఇంటికివెళ్లి అధికారులు హోమ్ పోలింగ్ ప్రక్రియ చేపట్టారు. ఆరుగురు వృద్ధులు, 11 మంది దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సూరంపల్లి గ్రామానికి చెందిన సోమన్నగారి గండవ్వ శతాధిక వృద్ధురాలు ఓటు హక్కును వినియోగించుకుంది. రాయపోల్ మండలంలో ఆరుగురు వికలాంగులు, 22 మంది వృద్ధులు పోస్టల్ బ్యాలెట్‌లకు దరఖాస్తు చేసుకోగా, వాటిని అధికారులు అంగీకరించారు. గురువారం ఎన్నికల సిబ్బంది ఆయా గ్రామాలల్లోని ఓటర్ల వద్దకు వెళ్లి మొత్తం 28 మంది ఓటర్ల వద్ద పోస్టల్ బ్యాలెట్లు సేకరించామని తహసీల్దార్ దివ్య తెలిపారు.

పీవో, ఏపీవోలు కీలకంగా వ్యవహరించాలి

- మెదక్ ఎన్నికల అబ్జర్వర్ సమీర్‌మాధవ్



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న సమీర్‌మాధవ్

గజ్వేల్, మే 2: పోలింగ్ ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు కీలకంగా వ్యవహరించాలని మెదక్ లోకసభ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ సమీర్ మాధవ్ సూచించారు. పట్టణంలోని ఎడ్యుకేషన్ హాబ్‌లో పీవో, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో పీవో, ఏపీవోలే కీలకమని, ఈవీఎంల మేనేజ్‌మెంట్, ప్రిసైడింగ్ అధికారుల డైరీ, మాక్ పోలింగ్, పోలింగ్‌శాతం రిజల్ట్ పంపడం, ఓటింగ్ ప్రారంభం, ముగింపు తదితర అన్ని నిబంధనలు ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్ ప్రకారం అందించాలన్నారు. అందుకు ఈ శిక్షణ కార్యక్రమాలలో అవగాహన పొందాలన్నారు. అనంతరం ఐటీసీలోని ఈవీఎం స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆయనవెంట గజ్వేల్ ఆర్డీవో, ఏఆర్‌వో బన్సీలాల్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

ఆరెపల్లిలో బోనాల పండుగ

హుస్నాబాద్, మే 2: హుస్నాబాద్ పట్టణంలోని ఆరెపల్లిలో గురువారం పోచమ్మబోనాలను కనుల పండువగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ బోనాలనెత్తుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

హరీశ్‌రావు సహకారంతో అన్ని రకాలుగా అభివృద్ధి

- మండల పరిషత్ ఉపాధ్యక్షుడు

సంతోష్‌కుమార్

నారాయణరావుపేట, మే 2: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సహకారంతోనే నారాయణరావుపేట మండల కేంద్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందని ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మొన్న నారాయణరావుపేట మండల కేంద్రంలో జరిగిన బీజేపీ సమావేశంలో బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు మండలం గురించి మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నారాయణరావుపేట మండలం హరీశ్‌రావు సహకారంతోనే సాధ్యమైందన్నారు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారని వెల్లడించారు. చైతన్యవంతమైన నారాయణరావుపేట గ్రామం ఎల్లప్పుడూ హరీశ్‌రావు వెంటే ఉంటుందని తెలిపారు. గ్రామ అస్తిత్వాన్ని దెబ్బ తీసే విధంగా, పోరాటాలను, పోరాట వీరులను కించపరుస్తూ రఘునందన్‌రావు మాట్లాడడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొనాయగారి ఎల్లయ్య అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా నాటి మాజీ నక్సలైట్లు ఉద్యమంగా పని చేశారని గుర్తు చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు కుంభలా ఎల్లారెడ్డి, నాయకులు ప్రభాకర్, ఎంపీటీసీ ఆకుల హరీశ్, గ్రామ అధ్యక్షుడు కొంగరి దేవరాజు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దీకొండ భాస్కర్, జిల్లా సీనియర్ నాయకులు బొంగురపు రఘుపతిరెడ్డి ,కొంగరి స్వామి, అశోక్, గ్రామ ఉపాధ్యక్షుడు బాలయ్య, బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు ఋషి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష

- బీజేపీ నాయకులు



దూళిమిట్ట: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

దూళిమిట్ట /మర్కుక్, మే 2: మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. మండల కేంద్రంతో పాటు లింగాపూర్ గ్రామంలో వారు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రచ్చ సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి కూరెళ్ల రాజు, చేర్యాల టౌన్ అధ్యక్షుడు మన్నే సత్యవర్ధన్, మండల పదాధికారులు తదితరులు పాల్గొన్నారు. మర్కుక్ మండలంలోని దామరకుంట గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్లు రామిరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా హాజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ సింగం సత్తయ్య ఉపాధ్యక్షుడు తాడూరి మహేశ్‌గౌడ్, కొమురయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి అర్కెసింగ్, మాజీ అధ్యక్షుడు రమేశ్‌గుప్త, బీజేపీ నాయకులు కుంట సత్యం, దామరకుంట బూత్ అధ్యక్షులు బోయిని రాజు, సీహెచ్ రాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గోపాల్, బీసీ మోర్చా అధ్యక్షుడు పంచ మధు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

- జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవకిదేవి

నంగునూరు, మే 2: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, సహజ సిద్ధమైన మోదుగు ఆకులతో తయారుచేసిన ఇస్తరాకులని వాడాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవకీదేవి సూచించారు. గురువారం నంగునూరు గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ కూలీలకు, డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. నంగునూరు గ్రామాన్ని ప్లాస్టిక్‌రహిత గ్రామంగా మార్చేందుకు ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులుగా సహజంగా లభించే మోదుగు ఆకులతో చేసిన విస్తరాకులను వినియోగించుకోవాలన్నారు. ఉపాధిహామీ కూలీలు ఒక్కొక్కరు 2 విస్తరాకులను కుట్టి, ఆ విస్తరాకుల వల్ల కలిగే ప్రయోజనాలు, ప్లాస్టిక్ వల్ల వచ్చే వ్యాధులపై క్లుప్తంగా వివరించారు. సమావేశానికి హాజరైన వారికి ఆ విస్తరాకుల్లో టిఫిన్ వడ్డించారు. అనంతరం గ్రామంలో వాటర్ ట్యాంక్‌లను పరిశీలించి తాగునీరు వృథాగా పోకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి చంద్రకళ, కారోబార్ అశోక్ కుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ నర్సింగరావు పాల్గొన్నారు.



విస్తరాకులను పరిశీలిస్తున్న డీపీవో



మద్దూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వేపచెట్టుకు విద్యుత్‌తీగలు అతుక్కుపోయాయి. పలుమార్లు విద్యుత్ అధికారులకు సమాచారం అందించినా సరిచేయలేదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే సరిచేసే అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈదురుగాలులకు చెట్టు ఊగితే విద్యుత్ తీగ తెగి ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

- మద్దూరు

ధాన్యం కొనుగోళ్లలో దళారులదే రాజ్యం

- రైతుకు దక్కని మద్దతు ధర
- చోద్యం చూస్తున్న అధికారులు

తొగుట, మే 2: రైతుల సౌలభ్యం కోసం గ్రామాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఆశించిన స్థాయిలో అవి ముందుకుసాగడం లేదు. రైతులు పంటకోయగానే ఆరబెట్టడానికి కల్లాలు లేక తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరగా క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకానికి రూ. 2,203, బీ గ్రేడ్ రకానికి రూ. 2,183గా నిర్ణయించింది. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లు సరిగా చేయకపోవడంతో పాటు ధాన్యంలో తేమ, పొల్లు ఉన్నాయని అధిక తూకం పేరుతో సెంటర్ నిర్వాహకులు, మిల్లర్లు ఇబ్బందులు పెడుతుండడంతోనే రైతులు దళారులను ఆశ్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తొగుట మండలంలోని వెంకట్రావ్‌పేట, జప్తిలింగారెడ్డిపల్లి, రాంపూర్, చందాపూర్, లింగాపూర్ గ్రామాల్లో కొద్దిరోజులుగా రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందకుండానే తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారులు క్వింటాల్ ధాన్యానికి రూ. 2,050 చెల్లించి కల్లాల వద్ద నుంచే కొనుగోలు చేస్తూ, రైతుల వద్ద అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయిస్తే 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమచేసే అవకాశం ఉన్నది. కానీ దళారులకు విక్రయిస్తే 10 రోజుల నుంచి నెల రోజుల పాటు డబ్బులు ఇవ్వకుండా చుట్టూ తిప్పుకుంటారని సమాచారం. గతంలో కూడ ధాన్యం కొనుగోలు చేసిన దళారులు రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఎగవేసిన సందర్భాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రైతులు దళారుల బారినపడి నష్టపోతున్నప్పటికీ అధికారులు అవేమీ పట్టించుకోకుండా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా చూడడంతో పాటు దళారుల పట్ల ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు.



మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లిలో ధాన్యాన్నితూకం వేస్తున్న దృశ్యం

కేంద్రాల్లో కొర్రీలు పెడుతున్నరు



ఆరుగాలం కష్టం చేసి పంట పండిస్తే పొల్లు ఉంది, తేమ ఉందని కొనుగోలు కేంద్రంలో కొర్రీలు పెట్టి, ఎక్కువ వడ్లను తూకం వేస్తుండ్రు. ఏమి చేయాలే ఎన్నిరోజులు ఎండలో ఉండాలి. ప్రైవేట్ సేట్లకు తక్కువ ధరకు వడ్లను అమ్ముకున్న. పదిహేను రోజులకు డబ్బులిస్తమన్నడు సేటు.

- కుమ్మరి నారాయణ (రైతు), జప్తిలింగారెడ్డిపల్లి